ISSN:3048-5908 Impact Factor: 3.63 (SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024

# అర్నాద్ కథలు - సామాజిక చైతన్యం

**డాక్టర్ పప్పల వెంకటరమణ**
ఎం. ఏ., పి హెచ్. డి. (గోల్డ్ మెడల్),తెలుగు విభాగాధిపతి,ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు, శ్రీకాకుళం,చరవాణి: 9491811710,ఈమెయిల్: ramanapappala1@gmail.com

**వ్యాస సంగ్రహం:** ఉత్తరాంధ్ర మాండలికంలో కథలు రాసి తెలుగు కథకు పుష్టిని చేకూర్చిన కథానిక రచయిత అర్నాద్ గారు. తన కథలందు సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న విభిన్న సమస్యలను, సామాజిక సమస్యలను, ఉద్యమాలను ఇతివృత్తాలుగా తీసుకొని కథలు రాశారు. అన్ని కథలు మానవ జీవిత సమస్యలతో ముడిపడి ఉంటాయి. మానవతావాదం అడుగడుగునా కనబడుతుంది.

సామాజిక స్పృహ, ప్రయోజనం, ఉద్యమస్ఫూర్తి అవగాహన మేలవించి వాస్తవమనిపించే అర్నాద్ గారి కథలు సార్వకాలీనమైనవి, విశ్వజనీయమైనవి. ఇంతటి ప్రసిద్ధి చెందిన అర్నాద్ కథలపై సమగ్ర పరిశోధన చేసి వాస్తవాలను పాఠకులకు తెలియజేయడమే వ్యాసరచయిత ముఖ్య ఉద్దేశం.

**కీలక పదాలు:** పేలంపాట, పెట్రోమాక్స్ లైట్, అంబులెన్స్, మాండలికపదాలు, మూర్తిమత్వం, నిశ్చితార్థం, వృద్ధాశ్రమం, ఉదారస్వభావం, పక్షవాతం, గుమస్తా.

**ఉపోద్ఘాతము:** కథారచన ఒక కళాసాధన. శిల్పి ఒక శిల్పాన్ని ఎంత శ్రద్ధాసక్తులతో మలచడానికి శ్రమిస్తాడో అలాగే రచయిత కథా సృజనలో అంతే రీతిన శ్రమించాలి. అదీ పరమ ఇష్టంగా. మనసా వాచా కర్మణా నిమగ్నమై రచించాలి. అలాంటి రచన మాత్రమే పాఠకుల మనో ప్రపంచం మీద ప్రగాఢమైన ముద్ర వేస్తుంది. ఈ విధమైన ముద్ర వేయగలిగిన కథల రచించిన అరుదైన రచయిత అర్నాద్.

ఇవి కథలు కాదు ప్రభంజనాలు, ఉల్కాపాతాలు, విస్ఫులింగాలు, చెక్కుచెదరని కొండలాంటి ఈ మారని వ్యవస్థ మీద అర్నాద్ గారు విసిరిన పాశుపతాలు. అగ్ని శిఖల్లాంటి అశ్రుకణాలు. నిస్సందేహంగా అర్నాద్ గారి కథలు గొప్ప కథలు. ఈనాటి మానవజాతికి అత్యంతావశ్యకం. సామాజిక ప్రయోజనం లక్ష్యంగా అర్నాద్ కథలు రాశారు. ఈ కథలు పాఠకుల్ని ఆలోచింపచేస్తాయి, అలజడి కలిగిస్తాయి. అందుకని వీటిని చదవాలి. చదివి వేగిరపడక రచయిత లక్ష్యాలను గురించి ఆలోచించాలి.

ఈ కథల మహత్తు చదివిన ప్రతిసారి ముప్పిరి గొంటుంది. కథ ముగింపు దగ్గర పాఠకులు ఆగిపోరు, ఆలోచిస్తారు. అసంకల్పితంగా వాటితో ప్రయాణిస్తారు. ఆ ప్రయాణమే హృదయ సంస్కారాన్ని ప్రోది చేస్తుంది.

ISSN:3048-5908 Impact Factor: 3.63 (SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024

లోలోపలి ప్రపంచాల్లో సున్నితమైన అనుభూతుల్ని తట్టి లేపుతుంది. సున్నిత మనస్కుల భావప్రపంచాన్ని కదిలిస్తుంది. వారి చేతనాచేతనలో భాగమవుతుంది. తెలియకనే వారి జీవనయానాన్ని శుభ్రపరుస్తుంది. అందుకే కవిత్వమంత ఇష్టంగా చదువుకోవాల్సిన కదలివి. ఈ కథలో కవిత్వ పరిభాష ఉందనుకోవద్దు. సాధారణమైన వచనం రచయిత సృజనలో దీప్తివంత మైనది. ఇంద్రజాలం అనిపించని ఇంద్రజాలమేదో కథలకు ఒక మహత్తును తీసుకొచ్చింది. ఈ మహత్తు పరవశానికి లోను చేస్తూనే మానవీయ స్పర్శను పరిమళింప చేస్తుంది. మానవ సంబంధాల్లో ఆర్ధత, ఆత్మీయత కోల్పోతున్నామంటున్నవారికి ఈ పరిమళం ఓ గొప్ప ఓదార్పు.

**ప్రధాన విషయం:** తెలుగు సాహిత్యాన్ని సామాజిక మార్పు కోసం ఉపయోగించాలన్న విశ్వాసం ఉన్న రచయితల్లో అర్నాద్ గారు ఒకరు.

అర్నాద్ గారు రాసిన కథలన్నీ ఇంచుమించు సామాజిక దృక్పథం సంతరించుకున్న కథలే. ఏ కథ చదివినా ఏదో ఒక సామాజిక దృక్పథం కనిపిస్తుంది. అర్నాద్ కథల్లో మనిషిని సంస్కరించేవి కొన్ని కథలైతే, తిరుగుబాటు నేర్పేవి కొన్ని కథలు. ఒక్క ముక్కలో చెప్పాలంటే అర్థాంతరన్యాసాలంకారం ఆర్నాద్ గారి కథల్లో చక్కగా ఇమిడిపోతుంది.

అర్నాద్ కథల్లోని వేలంపాట, రాధమ్మ పెళ్లి ఆగిపోయింది, బంధం, దిగొచ్చిన దేవత నాలుగు కథలు తీసుకొని వాటిలోని సామాజిక చైతన్యమును గూర్చి విశ్లేషించడం జరిగినది.

**వేలంపాట కథ - సామాజిక చైతన్యం:** అర్నాద్ గారి కలము నుండి జాలువారిన ఆణిముత్యం వంటి మొదటి కథ వేలం పాట. ఇందులో జీవిత విలువల కంటే వ్యాపార విలువలే ఎక్కువగా గౌరవించిన ఓ చంద్రయ్య బతుకులో అందకారం ఎలా ఆవరించిందో చెబుతుంది. సమాజంలో ఏ తండ్రి తన కూతుర్లను జ్యోతిలక్ష్మి వలె అందంగా తయారవమని, సిల్క్ స్మితలా ఫోజులిమ్మని, కూతురు అందచందాలతో వ్యాపారం చేయమని సలహా ఇవ్వరు. కానీ వేలంపాటలో చంద్రయ్య తన కూతురు చంద్రికతో ఇలాంటి ఉచిత సలహాలతో వ్యాపారం చేయిస్తాడు. చివరకు విషమించి కూతురు బలత్కారానికి గురై చంద్రయ్య పిచ్చివాడై విశాఖ వీదుల్లో తిరిగిన సంఘటనని ఆర్నాద్ గారు చక్కగా వివరించి చంద్రయ్య లాంటి వారికి గుణపాఠం కలిగేటట్లు కథను రాశారు. వ్యాపార ప్రకటనలో ఒళ్ళు దాచుకోకుండా వ్యవహరిస్తున్న అతివల తల్లిదండ్రులను వెన్ను తట్టి హెచ్చరించే కథ ఇది.

అపరిమితమైన ధనతృష్ణ మనిషిని ఎంత నీచానికి దిగజార్చుతుందో, ఇంకెంత పతనానికి చేరుస్తుందో 'వేలంపాట' కథ నిరూపిస్తుంది. అంతేగాక చంద్రయ్య లాంటి ధనదాసులకు, నీచనికృష్టులకు గుణపాటమే ఈ వేలంపాట. సమాజంలో చంద్రయ్య లాంటి వారి ధన దాహానికి అభం, శుభం తెలియని చంద్రిక లాంటి స్త్రీల నిండు జీవితాలు ఎలా బలైపోతున్నాయో అనేదానికి అద్దంపడుతుందీ కథ.

ఈ కథలోని పాత్రల వంటి వ్యక్తులు, వారి స్వభావాలు నేడు మన సమాజంలో మన మధ్యలో తారసపడుతుంటాయి. వేలంపాటలు మనం నిత్యం గ్రామాలు, పట్టణాల్లో చూస్తుంటాం. వస్తువుల్ని, వస్త్రాలని వేలం వేసి వ్యాపారం చేయడం ఒక జీవనోపాధి. ఈ కథలో రచయిత తన నివసిస్తున్న విశాఖ నగరాన్నే ప్రధాన కేంద్రంగా చేసుకొని రచించారు.

ఈ కథలో చంద్రయ్య వేలం వేయు వ్యాపారి. ఇతనికి స్థిరాస్తులు ఉన్నప్పటికీ, వృద్ధాప్యం ఆవరించినప్పటికీ సంపాదన పై ఆశతో వేలంపాట వ్యాపారం చేస్తుంటాడు. ఈయన భార్య చంద్రమతి ఉత్తమ ఇల్లాలు. సనాతన సంప్రదాయ భావాలు గలది. రచయిత ఈమెను నూటికి నూరుపాళ్లు తెలుగింటి ఆడపడుచులా చిత్రీకరించారు. ఉన్న ఒక్క కూతురికి మంచి సంబంధం చూసి వివాహం చేయాలని కోరికతో ఉండేది. హరిశ్చంద్రుడు భార్య చంద్రమతి వంటి గుణాల కలది. ఈమె మాటను ఆ ఇంట్లో ఎవరూ పట్టించుకునేవారు కాదు.

చంద్రయ్య తన వేలంపాట వ్యాపారం కోసం నగరంలోని ప్రధాన కూడలియందు సాయంత్రం పెట్రోమాక్స్ లైటు వెలుతురులో వేలంపాట ప్రారంభించేవాడు. దైవనామస్మరణలతో వేలంపాట ప్రారంభమయ్యేది. తన మాటల ద్వారా, ఉపన్యాసాల ద్వారా ప్రజల్ని ఆకర్షించి లాభాలు ఆర్జించేవాడు. చంద్రయ్యకు వ్యాపార రహస్యాలు బాగా తెలుసు. స్త్రీలు ఉంటే వ్యాపారం ఎక్కువగా రాణిస్తుందనే నమ్మకం కలవాడు. అందుకే వయస్సు, అందము ఉన్న తన కూతురు చంద్రికను ఉపయోగించి తన వ్యాపారము మూడు పువ్వులు ఆరు కాయలుగా వెలుగొందేటట్లు చేసుకున్నాడు. వ్యాపారంలోని మెళుకువలు కూతురికి నేర్పేవాడు. వ్యాపార అభివృద్ధికి కన్న కూతురినే వినియోగించడం పై ఎవరు ఎన్ని విధాలుగా అనుకున్నప్పటికీ చంద్రయ్య పట్టించుకునేవాడు కాదు.

ఈ కథలో చంద్రిక కూడా వయసుతో పాటు అందచందాలు కలది కాబట్టి అందరిని ఆకర్షించాలని కోరుకునేది. చంద్రిక ముస్తాబై మగాళ్ళ మధ్యన నిలబడటం ఒక సరదాగా భావించేది. **"విజయలలితలా కళ్ళు నిషాగా పెట్టు, జ్యోతిలక్ష్మిలాగ వయ్యారం ఒలికించు ఏటి? అది చేతకాకపోతే చెక్కిన శిల్పంలా అందంగా నిలబడు చాలు, తక్కింది నేను చూసుకుంటానన్నానుగా" అని ఏమీ కాకుండా అనేవాడు. ఛ! ఏమిటి నాన్న! పాడు మాటలు. కూతురుకి తండ్రి చెప్పాల్సినవేనా ఇవి?"** అలా అందే గాని ఆమెకు కొద్దిగా నైనా బాధ కలగలేదన్నది నిజం.

తండ్రి చంద్రయ్య విజయలలితల్ని, జ్యోతిలక్ష్మిలను చూసి నేర్చుకోమన్నాడే గాని నేడు చంద్రిక వారికి నేర్పగల స్థాయికి ఎదిగిపోయింది. ఒకరోజు చంద్రయ్య వేలంపాటలో ఊహించని సంఘటన జరిగింది. తను తెచ్చిన బట్టలన్నీ వేలం పాటలో చక్కగా అమ్ముడుపోయాయి. ఆఖరిగా ఒక పువ్వుల చీర మిగిలిపోయింది. ఆ చీరయే చంద్రయ్య కొంపలు ముంచింది. అప్పటికే సమయం రాత్రి పది గంటలు దాటింది. తన అందం ఆకర్షిస్తుందని గర్వపడింది చంద్రిక. వేలంపాట వద్దకు వచ్చిన వారిలో కొందరు రౌడీలు మూకగా ఉన్నారు. మందుపట్టులో మరీ నిషా ఎక్కిఉన్నారు.

ISSN:3048-5908 Impact Factor: 3.63 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024

చంద్రిక వారికి దిగివచ్చిన దేవతలా కనిపించింది. ఈ అందాల అప్సరసను కూడా వేలం పాట పెట్టమని వారు గొడవ పెట్టారు. **"ఏమయ్యోయ్! ఇదిగో వెధవ సీరల్ని వేలంపాడితే ఏటొద్ది - అదుగో సూడు, ఆ సీరలో పాలరాతి బొమ్మలాగా, జ్యోతినచ్చిమి లాగా మెరిసిపోతుందే ఆ గుంట. ఆ గుంటని పాడు వేలంపాట. లచ్చక్కి లచ్చలు గలగలా కురిసిపోతాయి. ఏమంటావ్?"** అన్నాడు ఆ రౌడీల్లో ఒక రౌడీ.

రౌడీలకు, చంద్రయ్యకు మధ్య మాటలు యుద్ధం జరిగింది. రౌడీల్లో ఒకడు చంద్రయ్యను కిందకు లాగేసి పెట్రోమాక్స్ లైట్ తన్నేశాడు. ఐదు నిమిషాల్లో జరగకూడని ఘోరాలన్నీ జరిగిపోయాయి. ఇంతలో పోలీసులు వచ్చి దొరికిన వారిని పట్టుకుపోయారు. చంద్రయ్యను, చంద్రికను అంబులెన్స్ లో ఆసుపత్రికి తీసుకెళ్లారు.

అక్కడకు చేరిన జనం మాత్రం కదలకుండా జరిగిన విషయాన్ని చెప్పుకుంటున్నారు.

**"అరే ఇంత అన్నేయం నా కళ్ళతో ఇంతవరకు ఎన్నడూ చూడలేదు. ఏమి ఘోరం! ఏమి ఘోరం!**
**అసలు ఇది ఊరా! అడివా?**
**నీ కళ్ళు పోయాయేటి? ఇది ఊరే - అది అంత పబ్లిక్ గా కులుకుతుంటే మనకే జిమ్మెడిపోతుంది గదా. ఇక తాగుబోతులూ, పొగరుబోతులూ తిన్నగా ఉంటారా?**
**ఇంకేం కులుగుతాదిలే ఆసుపత్రి పాలై పోతే**
**ఏమైతే మటుకూ గొప్ప చిత్రమే జరిగింది**
**పూర్కో, ఇదేం చిత్రం - ఢిల్లీలోనైతే పట్టపగలు కారులో ఉన్న అమ్మాయిని కారుతోనే ఎత్తుకుపోయి చెరిచేస్తున్నారయ్యా బాబూ. దాని దగ్గర ఇది ఒక లెక్కా.**
**అన్నట్టు నాకు డౌటు. ఇంతకీ ఆ పిల్ల శీలం పోయినట్టేనా?**
**నోర్మియస్. నీకు బుర్ర లేదసలు. ఐదు నిమిషాల్లో అంత కొట్లాటలో చెరచడం మాటలా? ఏదో కక్కుర్తి వెధవలు దొరికింది కొరుక్కున్నారు. దాన్ని నీలాటోళ్లు ఏకంగా శీలమే పోయిందనుకుంటున్నారు. ఛేస్, వెధవ మనుషులు. పూర్కోరా బాబూ".**

ఈ కథలో జరిగినటువంటి సన్నివేశాలు, సంభాషణలు, మాండలిక పదప్రయోగాలు నిత్యం మన గ్రామీణ కుటుంబ జీవితాలలో మనం చూస్తున్నటువంటివే.

**<u>రాధమ్మ పెళ్లి ఆగిపోయింది కథ - సామాజిక చైతన్యం:</u>** నేటి సమాజంలో కుటుంబ వ్యవస్థకు పునాది వివాహం. భారతీయ సంస్కృతిలో వివాహానికి సముచిత స్థానం ఉంది. వ్యక్తుల మనుగడ సాగించడం కోసం వివాహాలు తప్పనిసరి. వ్యక్తుల మూర్తిమత్వాన్ని పెంచి సామాజిక అభివృద్ధికి వివాహ వ్యవస్థ తోడ్పడుతుంది. అర్నాద్ గారి 'రాధమ్మ పెళ్లి ఆగిపోయింది' కథలో రాధమ్మ ఉన్నత విద్యావంతురాలు. సంప్రదాయ కుటుంబానికి చెందింది.

ISSN:3048-5908 Impact Factor: 3.63 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024

ప్రముఖ కంపెనీలో ఇంజనీరింగ్ ఉద్యోగం చేస్తుంది. రాధమ్మ తండ్రి మోహనరావుకు తెలిసిన వ్యక్తి ఆదిమూర్తి ద్వారా పెళ్లి సంబంధం వచ్చింది. ఇరువైపులా నచ్చి ముహూర్తాలు పెట్టించారు. సరిగ్గా ఇదే సమయంలో రాధమ్మ కంపెనీ పనిమీద విదేశాలకు తప్పనిసరిగా వెళ్ళవలసి వచ్చింది. ఆ కంపెనీలో అందుకు సమర్థురాలు రాధమ్మే. వివాహ ముహూర్తం పొడిగించమని పెండ్లి కుమారుని తరుపువారిని అడిగారు. అందుకు వారు అంగీకరించలేదు. ఉద్యోగం వదులుకోమని చెప్పారు. అర్థం చేసుకోలేని ఇలాంటి మనుషులని వివాహమాడుటకు రాధమ్మ అంగీకరించలేదు. రాధమ్మ పెళ్లి ఆగిపోయింది. అందుకు కుటుంబమంతా సంతోషించింది, కానీ విచారించలేదు. నేటి సమాజంలో ఇలాంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్నవి. పెళ్లి పీటల వరకు వచ్చిన పెళ్లిళ్లు చిన్న కారణాలవల్ల ఆగిపోయిన సంఘటనలు నిత్యం మనం చూస్తున్నవే. వరకట్నాల వల్ల, కులాంతరాల వల్ల వివాహాలు ముహూర్తాల వరకు వచ్చి తప్పిపోతున్నాయి. నేటి సాంఘిక వ్యవస్థకు దర్పణం పట్టే కథ ఇది.

రాధమ్మ తల్లిదండ్రులు రమణమ్మ, మోహనరావులు. కూతుర్ని ఐఐటి చదివిస్తున్నారు. రాధమ్మకు వయసు ఇరవై ఏడు సంవత్సరాలు. పొడుగు కాళ్ళ సుందరి. మోహనరావు మిత్రుడు ఆదిమూర్తి కొడుకు మంచి అందగాడు. గవర్నమెంట్ కంపెనీలో పెద్ద ఉద్యోగి. రాధమ్మను తన కుమారునికి ఇచ్చి పెళ్లి చేయమని మోహనరావు ఇంటికి వెళ్లి అడిగాడు. చదువుతున్న వయసులో పెళ్లికి ఇష్టపడలేదు. పిల్లను ఇవ్వకపోయినప్పటికీ బాధపడలేదు ఆదిమూర్తి. అర్థం చేసుకున్నాడు.

రాధమ్మ బెంగుళూరులో ఉద్యోగంలో చేరాక ఇంట్లో వాళ్ళు పెళ్లి సంబంధాలు చూడటం మొదలెట్టారు. రాధమ్మ కూడా పెళ్లి చేసుకోవడానికి అంగీకరించింది. ఆదిమూర్తి దూరపు బంధువులు విజయవాడలో ఉన్నారు. వరుడు పేరు కార్తీక్. బెంగుళూరులో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. కార్తీక్ తండ్రి తులసిరావు సౌమ్యుడు. నోటిలో నాలుక లేనివాడు. కార్తీక్ తల్లి కాంతమ్మ. అంతా సూర్యకాంతం అని పిలుస్తారు. నోరు పెద్దది. ఇరు కుటుంబీకులకు పెళ్లి సంబంధం నచ్చింది. ముహూర్తాలు పెట్టుకున్నారు. నిశ్చితార్థం తర్వాత రెండు నెలలకు పెళ్లి ముహూర్తం. పెళ్లి వెంటనే అయిపోతే బాగుండేది. ఆ రెండు నెలల్లోనూ మాటిమాటికి సూర్యకాంతం ఫోన్ చేయడం, ఏవేవో లాంచనాల రూపాన ఇబ్బందులు పెట్టేది. అది పెట్టాలి, ఇది పెట్టాలి అని పోరు పెట్టేది. కోటి రూపాయల కొడుకుని అతి తక్కువకే కుదుర్చుకున్నామని హడావిడి చేసేది. ఆ విషయాలు రాధమ్మకి తెలిసినా తను సంపాదిస్తుంది కనుక అవన్నీ ఇవ్వడానికి భరించింది. సూర్యకాంతమ్మ అంతులేని కోర్కెలకు నివ్వెరపోయేవారు రాధమ్మ తల్లిదండ్రులు.

కార్తీక్ కు అన్ని విధాలా రాధ నచ్చింది. నచ్చనిది ఒక పొడుగు విషయంలోనే. కార్తీక్ తన అక్క సుజాతకు ఆ విషయం చెప్పి బాధపడ్డాడు. హై హీల్స్ షూస్ నీవు వేసుకొని, తక్కువ ఎత్తు చెప్పులు రాధ వేసుకుంటే ఎత్తు సర్దుకుపోతుందని అక్క సుజాత చెప్పేసరికి కార్తీక్ సర్దుకుపోయాడు. రాధమ్మ, కార్తీకులు బెంగుళూరులో

ISSN:3048-5908 Impact Factor: 3.63 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024

పనిచేస్తున్నప్పటికీ కలుసుకునేవారు కాదు. ఈ మెయిల్స్, ఫోన్స్ చేసుకునేవారు. ఆ సమయంలో కార్తీక్ తల్లి కోరుతున్న గొంతెమ్మ కోరికలను చెప్పాలనిపించినప్పటికీ కార్తీక్ బాధపడతాడని చెప్పేదికాదు.

ఒకరోజు ఆదిమూర్తి పిడుగు లాంటి వార్త విన్నాడు. ఈమధ్య ఊర్లోలేడతడు. రాధమ్మ పెళ్లి ఆగిపోయింది అంటూ ఆ రాత్రే మోహన్ రావుకి ఫోన్ చేశాడు. ఫోన్ పలకలేదు. వెంటనే సూర్యకాంతం ఇంటికి ఫోన్ చేశాడు. ఇలాంటి ముదనష్టపు సంబంధం చూసినందుకు బంధువు అని కూడా చూడకుండా నానా రకాల తిట్లు తిట్టింది. ఎందుకు తప్పిపోయిందో అనే విషయం అర్థం కాలేదు. ఉదయాన్నే మోహన్ రావు ఇంటికి వెళ్ళాడు.

అసలు ఏమైంది? రాజమ్మ పెళ్లి ఎందుకు ఆగిపోయింది? మోహన్ రావు అడిగాడు.

అందుకు రాధమ్మ తల్లి **"అంతా మా ఖర్మ! రాధమ్మను మేము చదివించడం పెద్ద పొరపాటు, ఉద్యోగం చేయించడం అంతకన్నా పెద్ద పొరపాటు. ఇప్పుడది అందర్నీ వదిలేసి వెళ్ళిపోయింది. కూతుళ్లను కనకూడదని, కనినా చదివించకూడదని, చదివించినా ఉద్యోగాలు చేయించకూడదని"** రాధమ్మ తల్లి వాపోయింది. ఆదిమూర్తిని బయటకు తీసుకెళ్లి విషయాలన్నీ వివరంగా చెప్పాడు మోహనరావు.

రాధమ్మ పెళ్లి వైభవంగా జరగడానికి ఇక ఇరవై రోజులే ఉండగా అంతలోనే రాధమ్మ జీవితం ఒక టర్నింగ్ పాయింట్ దగ్గర అకస్మాత్తుగా ఆగిపోయింది. అనగా ఉన్నపాటున మరి ఏమి ఆలోచించకుండా అమెరికా వెళ్ళమని రాధమ్మ పనిచేస్తున్న కంపెనీ ఆదేశించింది. ఆ ప్రాజెక్ట్ ఇంపార్టెన్స్ అలాంటిది. దాన్ని డీల్ చేయడం రాధమ్మకు మాత్రమే సాధ్యమని ఆ కంపెనీ నమ్మకం. ఒక ఏడాది ప్రోగ్రాం.

రాధమ్మ ఓ పక్క హతాసురాలై, మరోపక్క చక్కని అవకాశానికి ఎంతగానో ఆనందించింది. తన వెడ్డింగ్ కార్డు చూపించి పెళ్లి ఆగకుండా వాయిదా వేయమని కంపెనీని ప్రార్థించింది. ఈ ప్రెస్టేజ్ ప్రాజెక్టుని వదులుకోలేము నీవు అమెరికా వెళ్ళలేక తప్పదు అంటూ కటువుగా, కర్కషంగా, మొండిగా నిలబడిపోయింది కంపెనీ యాజమాన్యం. ఈ స్థితిలో ఏమి చేయాలో తెలియక తన కాబోయే భర్త కార్తీక్ కొండంత అండగా ఉంటాడని అతని దగ్గరకు వెళ్లి విషయం చెప్పింది.

**"మై డియర్ రాధా! నీ ప్రాబ్లెం నాకు అర్థమైంది. కానీ నేను నిస్సహాయుడిని. నా చేతిలో ఏమీ లేదు. అంతా మా అమ్మే. అమ్మ ఒప్పుకుంటే ఒక ఏడాది కాదు కొన్ని యుగాలైనా వేచి ఉండగలను.**

**మీరు మీ అమ్మతో మాట్లాడి ఒప్పించరాదా?**

**మా అమ్మను ఒప్పించగలిగే శక్తి నాకు భగవంతుడు ఇవ్వలేదు".**

రాధమ్మ కుటుంబీకులు ఎన్ని ప్రయత్నాలు చేసినా పెళ్లి వాయిదా వేయుటకు కార్తీక్ కుటుంబం అంగీకరించలేదు. ఆ స్థితిలో రాధమ్మ ఉద్యోగానికి రాజీనామా చేసింది. కంపెనీ రాధమ్మను వదులుకోవడానికి ఇష్టం లేక పెళ్లయిన వారం రోజులకు అమెరికా వెళ్లడానికి అంగీకరించింది. ఈ విషయాన్ని కూడా కార్తీక్, అతని అమ్మ అమెరికా వెళ్ళడానికి వీలు లేదన్నారు. తనను కార్తీక్ అర్థం చేసుకోలేదని, కార్తీక్ ని కాదని రాధమ్మ అమెరికా వెళ్ళిపోయింది. పెళ్లి ఆగిపోయినందుకు ఆదిమూర్తి బాధపడలేదు. రాధమ్మ లాంటి కూతుర్ని కన్నందుకు మోహనరావు గర్వించమన్నాడు.

నేటి సాఫ్ట్ వేర్ ప్రపంచంలో ఇలాంటి సంఘటనలు జరిగి వివాహాల విచ్ఛిన్నతకు దారి తీయడాన్ని రచయిత వివరంగా తెలియజేసిరి.

**బంధం కథ - సామాజిక చైతన్యం:**

కుటుంబ వ్యవస్థ పట్ల రచయితకు చక్కని అవగాహన ఉందనే విషయం ఈ కథ చదివితే తెలుస్తుంది. ఈ కథ పూర్తిగా చైతన్యంతో కూడుకున్నటువంటిది. తల్లిదండ్రులని వాటాలు వేసుకుని ఆదరించే బంధాలు విషపరిష్వంగా లేవని చాటి చెప్పే హృద్యమైన కథ బంధం. సమిష్టి కుటుంబ వ్యవస్థ చితికిపోయిన తర్వాత సమాజంలో వృద్ధుల అవస్థ హృదయ విదారకంగా మారిపోయింది. తప్పనిసరి తద్దినంగాను లేదా ఆర్థిక స్వాతంత్రం ఉన్న వృద్ధుల విషయంలో స్వార్థబుద్ధితో ప్రవర్తించే నేటి తరపు అణుకుటుంబాల పరిధిలో కన్నా, తల్లిదండ్రులని గౌరవప్రదంగా చూసే సంప్రదాయం హరించుకుపోవడంతో పేగుబంధం, రక్త బంధం ఉన్నవారి మమతానురాగాల విషయంలో కూడా నూతన భాష్యాలు చెప్పుకోవలసిన అవసరం వచ్చింది. ఇటీవల కాలంలో వృద్ధుల నిరాదరణ గూర్చి, వృద్ధాశ్రమాలకు తరలిపోతున్న తల్లిదండ్రులు గూర్చి వందలాది కథలు వచ్చాయి. అయితే ఇదే ఇతివృత్తాన్ని తీసుకొని మనుషుల్లో స్వార్థాన్ని, అవకాశవాదాన్ని, పెద్దలు పెంచుకున్న మమకారాన్ని తెంచుకునే యువతర నైజం గూర్చి, అత్తింట, పుట్టింట ద్వంద ప్రమాణాలు పాటించే స్త్రీ అవలక్షణాల గూర్చి, జరుగుతుంది అన్యాయం అని తెలిసినా తీవ్రంగా మందలించి కట్టుకున్న ఆడదాన్ని అదుపులో పెట్టలేని మగమహారాజుల పిరికితనాన్ని గూర్చి, అద్భుతమైన సామాజికీకరణతో చిత్రీకరించి పాఠకుల్ని ఆశాంతం ఆసక్తితో చదివించిన బంధం కథ నేటి తెలుగు కథా ప్రపంచంలో ఒక ఆణిముత్యం.

రమణయ్యకు ఏడుపదుల వయస్సు మీద పడినప్పటికీ తన పనులు తాను చేసుకోగలడు. ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగం చేసి పది సంవత్సరాల క్రితం రిటైర్ అయ్యాడు. పెద్ద కుటుంబం. చిన్నతనంలో తండ్రి చనిపోవటం వల్ల కుటుంబ బరువు బాధ్యతలు అతనిపై పడ్డాయి. తమ్ముళ్లకు చదువులు చెప్పించి వారిని ఒక ఇంటి వారిని చేశాడు. చెల్లెళ్ళకు పెళ్లిళ్లు చేసి చక్కగా చూసుకున్నాడు. ఈయన భార్య సుందరమ్మ కూడా భర్తను మించిన ఉదార

ISSN:3048-5908 Impact Factor: 3.63 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024

స్వభావం గలది. ఆడపడుచుల పురుళ్లు పోసి తల్లి కంటే బాగా చూసుకుంది. రమణయ్య దంపతులకు కొడుకు, ఇద్దరు కూతుళ్లు గలరు. కొడుకు ప్రకాష్ వైజాగ్ లో ఇంజనీర్ గా పనిచేస్తున్నాడు. ఇద్దరు కూతుళ్లకు పెళ్లిళ్లు చేసి అత్తారింటికి పంపాడు. పెద్దల్లుడు ప్రభుత్వ ఉద్యోగి. చిన్న కూతురు, అల్లుడు కూడా ఉద్యోగాలు చేస్తున్నారు. పెద్ద కూతురు లలితకు ఇద్దరు పిల్లలు, చిన్న కూతురు అమ్మాజీకి కూడా ఇద్దరు పిల్లలు.

అనారోగ్య కారణం చేత సుందరమ్మ మరణించింది. బంధుజనమంతా వచ్చి దశాహం దగ్గరుండి జరిపించారు. ఒంటరివాడైన తండ్రి తనతో పాటు వైజాగ్ తీసుకుపోతానని కొడుకు ప్రకాష్ బంధువుల సమక్షంలో చెప్పాడు. కానీ రమణయ్య అందుకు ఒప్పుకోలేదు. నేను ఇక్కడే ఉంటాను. మీరందరూ వచ్చి పోతూ ఉండండి అన్నాడు. ఎవరు వత్తిడి చేయలేదు. చిన్న కూతురు అమ్మాజీ కూడా ఆ దగ్గరలోనే ఉంటూ ఉద్యోగం చేస్తుంది. ఇల్లు ఖాళీ చేసి తండ్రి దగ్గరకు వచ్చేసింది. కూతురు, అల్లుడు ఉద్యోగాలకు వెళ్లిపోతారు. రమణయ్య దగ్గరుండి మనుమళ్ళను చూసుకోవడం అతనికి పని అయింది.

పెద్ద కూతురు లలిత తన చెల్లెలపై చిర్రుబుర్రులాడుతుండేది. తండ్రికి ఆ వయస్సులో పిల్లలను సాకే భారం చూసుకోమనడం ఇష్టం లేదు. ఆ విషయంపై చెల్లెలను నిలదీయగా నాన్నకు లేని బాధ నీకెందుకు అని ఘాటుగా సమాధానం చెప్పింది. లలిత స్వార్ధపరురాలు. ఆమె భర్త శంకర్రావు చాలా మంచివారు. అతని రోగిష్టి తల్లిని ఇంటికి తెచ్చి రెండు రోజులు ఉంచుకోవడానికి లలిత అంగీకరించేది కాదు. వ్యవసాయం చేస్తున్న మరిదిని భూమిని పంచేయమని పోరు పెట్టేది. ఆమె చూడకపోవడం చేత శంకర్రావు తల్లి చనిపోయిందనే విషయం అందరికీ తెలుసు. చిన్న కూతురు అమ్మాజీ తండ్రిని మొదట్లో బాగానే చూసుకునేది. క్రమంగా చిరాకు ఎక్కువై తండ్రిని ఏవేవో మాటలు అనేసేది. చిన్న కూతురు అంటే రమణయ్యకు ఇష్టం. పెన్షన్ అందుకునే రోజు అమ్మాజీకి మిఠాయి దుకాణం నుంచి ఇష్టమైన అరిసెలు ప్రతినెల తెచ్చేవాడు.

రచయిత అర్నాధ్ గారు నేడు ప్రతి కుటుంబంలో అక్కాచెల్లెళ్ల మధ్య జరుగుతున్న అంతర్ ఘర్షణలను చాలా చక్కగా వివరించారు చూడండి....

**"ఆయనకి లేని కష్టం నీకెందుకు? ఇదేం బాగాలేదక్కా? నీ పిల్లల పసితనం రోజుల్లోకి ఒకసారి వెళ్ళు. నీవు పుట్టింట్లో కనేసిన పిల్లలు ఇద్దరినీ అమ్మా, నాన్నే చూసుకున్నారు కదా! నీ పిల్లలు స్కూలుకెళ్లే వయసు వచ్చేవరకు అమ్మానాన్న దగ్గరే ఉంచేశావు. అవునా? నేను నీ పిల్లల్ని నా భుజాలు పడిపోయేలా ఎత్తుకుని ఆడించాను. అల్లారు ముద్దుగా పెంచాను. నీకు ఆ విశ్వాసం ఉంటే ఈరోజు నీవిలా మాట్లాడవు అక్కా"** అని చెల్లెలు అమ్మాజీ నోరు జారగా, అక్క లలిత మాటకు మాట సమాధానం ఇలా చెప్పింది.

ISSN:3048-5908 Impact Factor: 3.63 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024

**"నీవు అనవసరంగా అర్థం లేని విషయాలు మాట్లాడుతున్నావు. వృద్ధాప్యంలో తండ్రిని నీవు చూస్తున్న తీరు బాగోలేదని నేనంటే నీవేమో గతం గెలికి నా పిల్లల దగ్గరికి వెళ్లి పోతున్నావు. దానికి దీనికి సంబంధం ఏమిటి? మలమూత్రాల విసర్జించిన గుడ్డలు మార్చడం, ముడ్డు కడగడం లాంటి పనులు నాన్న నా పిల్లలకు చేయలేదు. నీకు, నాకు, అన్నయ్యకి కూడా ఆయన చేయలేదు. చేయాల్సిన ఖర్మ ఆయనకి లేదు. ఒక గవర్నమెంట్ ఆఫీసర్ గా గౌరవంగా రిటైరయిన తండ్రి చేత - అదీ ముసలి వయసులో - ఇలాంటి పాకీ పనులు చేయించడం ఏమైనా బాగుందా?"** అంటూ అక్కా చెల్లెళ్లు ఇద్దరూ మాటకుమాట విసురుకున్నారు.

ఈలోగా అమ్మాజీ సొంతంగా డబల్ బెడ్ రూమ్ ఇల్లు చక్కగా కొట్టుకుంది. తనకు నచ్చిన మోడల్ ల్లో అందంగా నిర్మించుకుంది. నూతన గృహప్రవేశం జరిపి అందరినీ ఆహ్వానించారు. ఇల్లు చూసి అందరూ మెచ్చుకుంటుంటే విజయ గర్వంతో అమ్మాజీ మురిసిపోయింది. అదే సమయంలో ఎనిమిది పదుల వయసు వచ్చిన తండ్రిపై చిరాకు పడేది. ఒకసారి చిన్న కూతురు అమ్మాజీ ఇంటిలో రమణయ్య నిద్రలో దగ్గుతూ బాధపడుతుండగా **"పెంకులెగిరిపోయేలా ఏమిటా ముష్టి దగ్గు? మమ్మల్ని నిద్ర పోనివ్వరా? ఏమైంది మీకు? చుట్టలు మానేయమని నెత్తి నోరు బాదుకున్నాను. అది నా ఊపిరమ్మా అని రాగాలు తీశారు. మీ ఊపిరితిత్తులు తినేయడం కాదు మాకు ఊపిరాడనీయకుండా నిద్రాభంగం చేస్తుంది. ఉద్యోగాలు చేసి వచ్చే మాకు ఏమిటీ శిక్ష చెప్పండి, కాసేపు నిద్ర పోనివ్వరా? అని కేకలు వేసింది".** అప్పటినుండే సంతానము పై మనసు విరిగిపోయి వృద్ధాశ్రమంలో హాయిగా శేష జీవితం గడపడానికి రమణయ్య నిర్ణయించుకున్నాడు.

తండ్రిని తమ దగ్గర ఉంచుకోమని అన్నయ్య, అక్కను ఆమె అడిగింది. అన్నయ్య అంగీకరించాడు. ప్రకాష్ నాలుగు నెలల అమెరికా యాత్ర నుండి తిరిగి వచ్చేవరకు, లలిత తండ్రిని ఉంచడానికి తప్పనిసరి పరిస్థితుల్లో సిద్ధపడింది. కానీ ఆమె భర్త శంకర్రావు సిద్ధంగా లేడు **"అత్తను సరిగా చూసుకోలేని లలిత, తండ్రిని కూడా సరిగా చూసుకోలేదని"** పెద్దల సమక్షంలో తెలిపాడు. రమణయ్య ఎవరి వద్ద ఉండడానికి ఇష్టపడక వృద్ధాశ్రమానికి వెళ్లిపోయాడు.

అమ్మాజీ నూతనంగా కట్టుకున్న గృహం బోసిపోయింది. తండ్రి లేని లోటు తెలిసింది. భర్త సూర్యం, పిల్లలు ఉండలేకపోయారు. అమ్మాజీ కూడా అందరికంటే ఎక్కువగా బాధపడింది. తండ్రిని వదిలి ఉండలేకపోయింది. పరుగు పరుగున తండ్రి వద్దకు వచ్చి కాళ్లపై పడి ఏడ్చింది. ఇంటికి వచ్చేయమని ప్రాధేయపడింది. అక్కడ వృద్ధాశ్రమంలో విజిటర్స్ వెయిటింగ్ హాల్లో గోడపై నల్లటి అక్షరాలు కనిపించాయి. **"వృద్ధులను ఒక బరువుగా భావిస్తే అది కృతఘ్నతకి గుర్తు"** అని చదివి అవును నేను కృతఘ్నురాలినే అనుకుంది అమ్మాజీ.

ISSN:3048-5908 Impact Factor: 3.63 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024

నేటి మన సమాజంలో అర్నాద్ గారు బంధం కథలో పేర్కొనబడిన విషయాలే జరగడం విశేషం. రమణయ్య భార్య పోయి వృద్ధాప్యంలో ఒంటరివాడైపోయాడు. కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నప్పటికీ ఎవరి పంచనా చేరలేదు. కారణం తన సంతానం స్వార్థంతో కలవారిని ముందే అతనికి తెలుసు. నేటి మన సమాజంలో ఎందరో రమణయ్యలు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అర్నాద్ గారు తన ప్రతిభ అంతా రంగరించి చక్కని సామాజిక చైతన్యం కలిగిన ఈ కథను వ్రాసి పాఠకుల మన్ననలు పొందారు.

**<u>దిగొచ్చిన దేవత కథ - సామాజిక చైతన్యం:</u>**

ఇద్దరు ప్రేమికులు పరిస్థితుల ప్రభావము వలన విడిపోయి, వేర్వేరుగా పెళ్లిళ్లు చేసుకుని చాలా సంవత్సరాల తర్వాత కలుసుకొని పూర్వపు ప్రేమానుభూతులను పొందడం 'దిగివచ్చిన దేవత కథ'లో ప్రధానాంశం.

ఈ కథలో రామ్మూర్తి గంపెడు పిల్లలతో, చాలీచాలని జీతంతో కుటుంబం గడవక, అప్పులపాలై, నానా కష్టాలు పడుతున్నాడు. తను చదువుకున్న రోజుల్లో కృష్ణవేణిని గాఢంగా ప్రేమించి విఫలమయ్యాడు. ఇప్పుడు కృష్ణవేణి భోగభాగ్యాలను అనుభవించి ఉన్నత స్థాయిలో ఉంటుంది. భర్త పక్షవాతంతో మంచం పట్టి, సంసారానికి పనికిరాక, పిల్లలు లేని బాధతో మానసికంగా బాధపడుతుంది. మండుటెండలో నడిచి వెళుతున్న రామ్మూర్తిని గుర్తించి కృష్ణవేణి కారులో ఎక్కించుకొని అనురాగం ఆప్యాయతల్ని పంచిపెడుతుంది. రామ్మూర్తి ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని పదివేల చెక్కు ఇచ్చి ఆదుకుంటుంది. రామ్మూర్తి దృష్టిలో ఇప్పుడు కృష్ణవేణి "దిగివచ్చిన దేవత"లా కనిపించింది. నేడు కూడా సమాజంలో కష్టసుఖాల్లో ఆదుకునే వారు, ప్రేమానురాగాలను కురిపించేవారు, స్నేహానికి విలువ నిచ్చే కృష్ణవేణి లాంటి వారు ఎందరో కలరు. ఇది మన భారతీయ సంస్కృతికి దర్పణం పడుతుంది. అర్నాద్ గారు ఈ కథ ద్వారా మానవ విలువలకు ప్రాధాన్యం ఇచ్చి సామాజిక వికాసానికి దోహదపడ్డారు.

మంచి ఆశయాలు గల మనిషి రామ్మూర్తి. తన ఆశలు, ఆశయాలు, సుఖాలు సరదాలు అన్నీ నేలపాలయ్యాయి. కృష్ణవేణిని ప్రేమించి పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. ప్రేమించాడుగానీ పెళ్లి చేసుకోలేకపోయాడు. ఎల్. ఎల్. బి. చదివి ప్లీడర్ కావాలనుకున్నాడుగాని కాలేకపోయాడు. చచ్చినా గుమస్తా ఉద్యోగం చేయకూడదు అనుకున్నాడు. చచ్చినట్లు చేస్తున్నాడు. ఇరవై ఆరు సంవత్సరాల వయసులో పెళ్లయింది. పూలు అమ్మిన చోట కట్టెలు అమ్మలేక మరో ఊరు వెళ్లిపోయాడు. తాలూకా ఆఫీసులో గుమస్తా ఉద్యోగం చేస్తున్నాడు.

కుటుంబ నియంత్రణ పాటించక అధిక సంతానం కలిగితే ఎలాంటి ఇబ్బందులు కలుగుతాయో రామ్మూర్తి జీవితం ఒక ఉదాహరణ....

ISSN:3048-5908 Impact Factor: 3.63 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024

**"రామ్మూర్తి ఐదుగురు పిల్లల తండ్రి అయ్యాడు. ఆరో పిల్లకు తండ్రి అయ్యే భాగ్యం పెళ్ళాం చనిపోవడం వల్ల పోగొట్టుకున్నాడు. పెద్ద పిల్లకు నానా తిప్పలు పడి పెళ్లి చేశాడు. పెళ్లికి వచ్చిన రెండో పిల్లకు పెళ్లి చేయలేక చస్తున్నాడు. మూడోవాడు మూడవ ఫారం చదువుతున్నాడు. ఫీజు కట్టలేదని ఇంటికి పంపేశారు. తక్కిన ఇద్దరు పిల్లలు అదని, ఇదని తండ్రిని వేధించుకు తింటున్నారు. ముసలి తండ్రి రోగంతో మంచాన పడి మూలుగుతున్నాడు. గొర్రె తోక జీతం చాలక వరహాల రాజు దగ్గర నగనట్రా పెట్టి అప్పులు కూడా చేశాడు. గుండె మీద కుంపటిలాగా పెద్ద కూతురు పురుడికి వచ్చి కూర్చుంది. రామ్మూర్తి దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్నాడు".**

కుటుంబ నియంత్రణ పాటించక, అధిక సంతానంతో వారిని చదివించలేక, పోషించలేక, వివాహాలు జరిపించలేక నేడు మన చుట్టూ ఉన్న సమాజంలో దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్న రామ్మూర్తులు ఎందరో మన కళ్ళ ముందు సాక్షాత్కరిస్తారు.

మాధవధారలో ఉండే వరహాల రాజు ఇంటికి రామ్మూర్తి ఒకరోజు మిట్ట మధ్యాహ్నం ఎండలో నడుచుకుని అప్పు కోసం వెళుతున్నాడు. దారిలో చెప్పు తెగిపోతే తన జేబులోని పిన్నీసుతో కుట్టుకొని నడిచి వెళుతున్నాడు. దూరంలో ఎర్రకారుని చూశాడు. అది తిన్నగా తన దగ్గరికి వచ్చి ఆగింది. కారులో ఒక వెన్నెల విసనకర్ర ఉంది. ముఖంలోకి చూసి, అనుమానంతో కళ్ళు చక్రాల్లా తిప్పుతూ చూసి మీరు చిలకల రామ్మూర్తి గారు కదూ అని అంటూనే 'ఏయ్ మూర్తి' ఏమి చేస్తున్నావని అడిగేటప్పటికి కృష్ణవేణి అని పోల్చి ఆనందం పట్టలేకపోయాడు. కారు ఆపి దారి ప్రక్కన మర్రిచెట్టు కిందకు వెళ్లారు. కృష్ణవేణి అతని ఎదుట దివి నుండి భూమికి దిగివచ్చిన దేవతలా ఉంది. వారిద్దరూ ఇరవై సంవత్సరాల తర్వాత కలుసుకోవడం వల్ల ఏదో ఆనందం అనుభవిస్తున్నారు. గతంలోకి వెళ్లి ప్రేమ రాజ్యంలో విహరిస్తున్నారు. ఆనందంలో ఆమె సర్వం మరిచింది. అతడు వచ్చిన పని మరిచాడు. అతడు కృష్ణవేణిని కలుస్తానని కలలో కూడా ఊహించలేదు. ఆమె ఇరవై సంవత్సరాల నుండి రామ్మూర్తిని తలవని రోజు లేదు. తండ్రి మాటను కాదనలేక రామ్మూర్తి వేరే స్త్రీని పెళ్లి చేసుకున్నాడని కృష్ణవేణికి తెలుసు. కానీ కృష్ణవేణి ప్రేమను శంకించడానికి లేదు.

కృష్ణవేణి ఉన్నత కుటుంబానికి చెందింది. రామ్మూర్తిని ప్రేమించి విఫలమైంది. తర్వాత ఉన్నత కుటుంబంలోని వ్యక్తిని వివాహమాడింది. విజయవాడలో ఉంటుంది. పెళ్లి అయిన ఆరు నెలలకే భర్తకు పక్షవాతం వచ్చింది. ఇంకా పిల్లలు లేరు. ఆమె లేకుండా భర్త ఒక్క క్షణం ఉండలేడు. భర్తకి చిన్నపిల్లవాడిలా అన్ని సేవలు కృష్ణవేణి దగ్గరుండి చేసుకుంటుంది. ఎంతోమంది పని వారు, ఎన్నో రకాల కార్లతో విలాసమైన జీవితం ఈమెది. కానీ భర్త ఆ స్థితిలో ఉండటం వల్ల ఆమె తన కోర్కెలను తనలోనే అణచుకునేది. ఒకరోజు వీరి చిన్ననాటి స్నేహితుడు భాస్కర్ కనిపించాడు. తన ప్రియుడు రామ్మూర్తి గురించి అడిగేటప్పటికీ విషయాలన్నీ పూసగుచ్చినట్లు చెప్పాడు. తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడని, భార్య చనిపోయిందని, అధిక సంతానమని చెప్పాడు. ఈనాటికి కృష్ణవేణి రామ్మూర్తిని ప్రేమిస్తోంది. అతన్ని కలవడం కోసం విశాఖపట్నంలో రెండు రోజుల నుండి తిరుగుతోంది. దేవుని దయవలన నీవు

కనిపించావని గట్టిగా కౌగిలించుకుంటుంది. పెదాలపై ముద్దులు కురిపించింది. ఇద్దరు తమ కుటుంబాలను గురించి ఆలోచించడం మరిచిపోయారు. రామ్మూర్తి కృష్ణవేణి మీదకు పడబోతుంటే చేతులతో ఆపి, మాటలతోనే సరిపెట్టింది. అతనికి రెండో పెళ్లి చేసుకోమని సలహా ఇచ్చింది. తన భర్త అంటే ఆమెకు ప్రాణమని స్పష్టం చేసింది.

కృష్ణవేణి తనను విడిచి వెళుతుంటే తట్టుకోలేకపోయాడు రామ్మూర్తి. కృష్ణవేణి పదివేల రూపాయలు చెక్కు ఇచ్చింది. రామ్మూర్తి తిరస్కరించాడు. పిల్లల కోసం తీసుకోమని కృష్ణవేణి అనేటప్పటికి రామ్మూర్తి కాదనలేకపోయాడు. తనని విడిచి వెళుతున్న కృష్ణవేణిని చూసి బాధపడ్డాడు. తన కష్టాలు తీర్చడానికి కృష్ణవేణి 'దిగివచ్చిన దేవతలా' అనిపించింది.

నేటి మన సమాజంలో తల్లిదండ్రులు యువతీ యువకుల ఆలోచనలకు, ఆకాంక్షలకు విలువ ఇవ్వకుండా వివాహాలు జరిపిస్తే ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయి.

**ముగింపు:** అర్నాద్ గారి కథల్లో సామాజిక చైతన్యం వుట్టిపడుతుంది. జీవించడం, జీవితాన్ని నిండుగా, రసాత్మకంగా కాకున్నా సహజాతి సహజంగా జీవించడం, దుర్లభమవుతున్న వర్తమాన కఠోర వాస్తవికతని ఈ కథల ద్వారా మన ముందు నిలిపారు రచయిత. మహోన్నత విప్లవాల సంగతలా ఉంచితే, కనీసం మనుషులుగా మసులుకోవడం బాధ్యత అనే చెప్పకనే చెప్పడం ఈ కథల విశిష్ట లక్షణం.

రచయిత ఈ కథలను అణగారిన వర్గాల ఆలోచనలకు, అనుభవాలకు, ఆత్మక్షోభకు అక్షర రూపం ఇవ్వడానికి ఈ కథల్ని రాశారేమోననిపిస్తుంది. మారుతున్న ప్రపంచంలో మారిపోతున్న మానవ సంబంధాల గురించి మనకు తెలియజేస్తూనే, కాలం ఎంత మారినా, మారకూడని కొన్ని మానవతా విలువలు ఉంటాయని, ఇంకా ఉన్నాయని, వాటికి ప్రతినిధులుగా మనకు కొందరిని పరిచయం చేస్తారు ఈ కథల్లో రచయిత.

ఎన్నో కొన్ని విలువలు ఉన్న గతమే, ఏ విలువలు లేని వర్తమానం కంటే బాగుందని భావించే చాలామందితో కొంతవరకు ఏకీభవిస్తూనే, ముందు తరంలోని ఉత్తములు కన్నా, నేటితరంలోని ఉత్తములు బహు మంచివారు. పైగా గడుసు వారు అని కూడా మనకు కొన్ని కథల ద్వారా తెలియజేస్తున్నారు.

ఒక విధంగా ఈ కథలన్నీ న్యూ మిలీనియంలో పెద్దలకు పిల్లలకు మధ్య, బంధువులకు స్నేహితులకు మధ్య, భిన్న వర్గాలకు, సంస్కృతులకు చెందిన పరిచయస్తుల మధ్య వెల్లివిరిసిన, రగిలిరేగిన రాగద్వేషాల గాఢత పై, విస్తృతిపై చాలా సంయమనంతో సాగిన ఒక రన్నింగ్ కామెంటరీ.

ఈ కథలు మనల్ని చైతన్య పరుస్తాయి. చక్కలిగింతలు పెడతాయి. మన ఎగుడుదిగుడు జీవితాల్ని నడిపించే జీవన సూత్రాలను చూపిస్తాయి. తట్టి లేపుతాయి.

ISSN:3048-5908 Impact Factor: 3.63 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024

**ఆధార గ్రంథములు:**

1. వెంకటసుబ్బయ్య వల్లంపాటి (2008), కథా శిల్పం(తృతీయ ముద్రణ), విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

2. కనకయ్య చామర్తి (1985), శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి చిన్న కథలు-సమగ్ర సమీక్ష, తరుణ సాహితీ, కాకినాడ.

3. దక్షిణామూర్తి పోరంకి (1975), కథానిక వాంగ్మయం, ప్రపంచ తెలుగు మహాసభ ప్రచురణ.

4. ఇనాక్ కొలకలూరి (1972), వాస్తవికత- తెలుగు కథానిక, మహతి సమీక్షా వ్యాస సంకలనం, యువభారతి, సికింద్రాబాద్.

5. కుటుంబరావు కొడవగంటి (1969), సాహిత్య ప్రయోజనం (వ్యాసావళి), విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

6. అర్నాద్(2006), బంధం కథల సంపుటి, వాహిని బుక్ ట్రస్ట్, హైదరాబాద్.

7. అర్నాద్(2013), ఆపద్ధర్మం కథల సంపుటి, పాలపిట్ట బుక్స్, హైదరాబాద్.

8. అర్నాద్(1972, ఏప్రియల్), దిగొచ్చిన దేవత కథ, ఆంధ్రప్రభ వారపత్రిక.

9. అర్నాద్(1972, ఏప్రియల్), పేలంపాట కథ, స్వాతి వార పత్రిక.

10.అర్నాద్(2006, ఫిబ్రవరి), బంధం కథ, రచన మాసపత్రిక.